
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.4
ANDHRAJYOTHY

నల్లగొండ
5
సోమవారం 4 నవంబరు 2024

యాదగిరిగుట్టలో భక్తుల సందడి



7

2025 మే నాటికి వినియోగంలోకి వైటీపీఎస్

● డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ● సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో సుడిగాలి పర్యటన



థర్మల్ పవర్‌ప్లాంట్‌లో రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వచ్చే ఏడాది మే నాటికి వైటీపీఎస్‌లో ఐదు యూనిట్లు ప్రారంభించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల, సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో సింక్రనైజేషన్, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో రూ.200కోట్లతో నిర్మిస్తున్న మోడల్ కాలనీ పునర్నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. అంతకుముందు గడ్డిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడారు.

7

బీసీలను అణగదొక్కితే

రాజకీయ సమాధి చేస్తాం

● బీసీ గర్జన సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



బీసీ గర్జన సభలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, నేతి విద్యాసాగర్, బీసీ సంఘం నేతలు

బీసీలను అణగదొక్కాలని చూస్తే రాజకీయ సమాధి చేస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన బీసీ గర్జన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ గర్జన సభను విఫలం చేసేందుకు డిప్యూటీ సీఎం, మంత్రుల కార్యక్రమం పెట్టించారని ఆరోపించారు.

7

న్యూస్ బాక్స్

ధాన్యం కొనుగోళ్లను

వేగవంతం చేయాలి


కలెక్టర్ ఇలా త్రిపాఠి



పానుగోడులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కనగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. అకాల వర్షానికి పానుగోడు ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులను కలెక్టర్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం రాశులను లోతట్టు ప్రాంతంలో కాకుండా ఎత్తు ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. 17శాతం తేమ ఉన్న ధాన్యానికి కాంటాలు వేసి ఎప్పటికప్పుడు ఎగుమతి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. సీరియల్ ప్రకారం కాంటాలు వేసి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కొనుగోళ్లలో అవతవకలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఆమె వెంట డీఆర్డీవో ఎర్రబెల్లి శేఖర్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పద్మ, సీసీ ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

చర్యలు షురూ



- ఫేక్‌సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందిన జేఎల్‌లపై విచారణ ముమ్మరం
- తొమ్మిది మందిపై వేటేసిన ఇంటర్‌బోర్డు
- ఉమ్మడి జిల్లాలోనూ 15మందిపై ఫిర్యాదులు
- బోర్డు చర్యలతో వారిలో వణుకు

నకిలీ ధ్రువపత్రాలతో జూనియర్, వొకేషనల్ లెక్చరర్లుగా క్రమబద్ధీకరణ పొందిన అధ్యాపకులపై చర్యలకు ఇంటర్‌బోర్డు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులపై విచారణ నిర్వహించిన బోర్డు తొలుత తొమ్మిది మందిని ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేసింది. ఉమ్మడి జిల్లాలో సైతం తప్పుడు సర్టిఫికెట్లతో జూనియర్ లెక్చరర్లుగా క్రమబద్ధీకరణ పొందారని 15మందిపై ఇంటర్‌బోర్డుకు, ఉన్నత విద్యామండలికి, సీబీసీఐడీకి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఇంటర్ బోర్డు చర్యలు తీసుకోవడం ప్రారంభించడంతో వీరిలో గుబులు మొదలైంది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ఉమ్మడి జిల్లాలోనూ కదులుతున్న ఫేక్ సర్టిఫికెట్ల డొంక

ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఎనిమిది మంది, జనగామ, హైదరాబాద్, బోధన్ కళాశాలల్లో పనిచేస్తున్న మరో ముగ్గురు, మొత్తం 11 మంది లెక్చరర్లు క్రమబద్ధీకరణ సమయంలో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారని ఆధారాలతో సహా గత ఏడాది డిసెంబరున ఇంటర్ విద్యాశాఖ ఆర్‌జేడీ, కమిషనర్‌తో పాటు ఆయా జిల్లాల ఇంటర్ విద్యాధికారులకు రాష్ట్ర ప్రభుత్వ విద్యావనరుల పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి, ఓయూ రీసెర్చ్‌స్కాలర్ వేముల శేఖర్ ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మిర్యాలగూడలో ప్రత్యేక విద్య అందించే ముగ్గురు అధ్యాపకుల క్రమబద్ధీకరణలోనూ నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారని ఆధారాలతో ఫిర్యాదులు వెళ్లాయి.

● యాదాద్రి జిల్లాలో ఓ ఉపాధ్యాయురాలు కేవలం పదోతరగతి మాత్రమే పాసై అలహాబాద్‌కు చెందిన హిందీ సాహిత్య సమ్మేళన్ జారీ చేసిన సర్టిఫికెట్ సమర్పించారు. ఈ సంస్థకు యూనివర్శిటీ హోదా లేదు.

● సాగర్ నియోజకవర్గంలోని ఒక జూనియర్ కళాశాలలో పనిచేసే లెక్చరర్ తమిళనాడు రాష్ట్రం సేలంలోని వినాయకమిషన్ డీమ్డ్ యూనివర్శిటీ నుంచి పీజీ చేసినట్టు సర్టిఫికెట్ సమర్పించారు. ఈ యూనివర్శిటీకి ఆ సమయానికి యూజీసీ గుర్తింపులేదు. పైగా సదరు యూనివర్శిటీ పీజీలో జువాలజీ కోర్సు నిర్వహించడం లేదు.

● మరో కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు పదోతరగతి మెమోలో పుట్టినతేదీ, పుట్టుమచ్చల వివరాలు మార్చారు. పుట్టినతేదీ 29, ఫిబ్రవరి 1970గా పేర్కొనగా, ఆ ఏడాది ఫిబ్రవరిలో 28వ తేదీ మాత్రమే ఉంది.

● నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు పదోతరగతి మెమోలో పుట్టిన తేదీని మార్పు చేశారు.

● మరో జూనియర్ లెక్చరర్ పది నుంచి పీజీ వరకు ఎక్కడా ఉర్దూ మీడియంలో చదవకున్నా ఉర్దూ మీడియం లెక్చరర్‌గా క్రమబద్ధీకరించారు.

● ఇంకో అధ్యాపకుడు పాట్నాలోని ఏఎన్.కాలేజీలో ఫిజిక్స్ చేసినట్టు సర్టిఫికెట్ సమర్పించగా, ఆ సమయంలో ఆ కళాశాలలో ఆ కోర్సు లేనే లేదు.

● మరో లెక్చరర్ జార్ఖండ్ రాష్ట్రంలోని రాయపూర్ కళింగ యూనివర్శిటీ పీజీ సర్టిఫికెట్ సమర్పించారు. సదరు యూనివర్శిటీ దూరవిద్యలో ఎంఎస్సీ (కెమిస్ట్రీ) కోర్సును నిర్వహించడం లేదు.

● ఓకేషనల్ కళాశాలలో పనిచేస్తున్న మరో లెక్చరర్ సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా తమిళనాడు యూనివర్సిటీ నుంచి కోర్సు చేసినట్టు సర్టిఫికెట్ సమర్పించారు.

● మిర్యాలగూడలో ప్రత్యేక విద్యను బోధించే సెక్షన్లలో క్రమబద్ధీకరణ పొందినవారిలో ముగ్గురు సైతం తప్పుడు పత్రాలను సమర్పించినట్టు ఇంటర్‌బోర్డుకు ఫిర్యాదులు వెళ్లాయి. నిబంధనల ప్రకారం 2014కు ముందే ఈ పోస్టులకు కావాల్సిన అర్హతలు పొంది, పనిచేస్తున్న అధ్యాపకుల జాబితానే క్రమబద్ధీకరణకు పంపాల్సి ఉండగా, ఈ అధ్యాపకుల్లో ముగ్గురికి ఆ తేదీ నాటికి సదరు అర్హతలు లేవు. అయితే వారి పేరును జాబితాలో చేర్చి క్రమబద్ధీకరణ చేయడం వెనక ఉన్నతాధికారులు, కీలక అధికారుల ప్రమేయుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, మిర్యాలగూడ కళాశాలలో పనిచేస్తూ

మిగతా 8వ పేజీలో...

స్థానికంలో గెలుపెలా?

- నియోజకవర్గాల్లో తాజా పరిస్థితులపై నేతల ఆరా
- హామీల అమలుపై కాంగ్రెస్ సమీక్షలు
- నెరవేరని హామీలపై ప్రజల్లోకి ప్రతిపక్షాలు

యాదాద్రి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసిన అధికారులు, మిగిలిన పనుల్లో వేగం పెంచారు. జిల్లాల వారీగా బ్యాలెట్ బాక్సులకు మరమ్మతులు చేపట్టారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రి ఉమ్మడి జిల్లాలకు చేరుతోంది. షెడ్యూల్ విడుదల కాగానే ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు అవసరమయ్యే మాడ్యూల్స్, ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారుల హ్యాండ్ బుక్స్ జిల్లాలకు చేరాయి. రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. అందుకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

స్థానికంలో మూసీ పునరుజ్జీవం

మూసీ నది పునరుజ్జీవానికి కాంగ్రెస్ సర్కారు సంకల్పించింది. రూ.1.50లక్షల కోట్లతో మూసీని మెరిసేలా చేస్తామని ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. అయితే హైదరాబాద్‌లో ఉన్న కలుషిత నీరంతా మూసీ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చేరుతోంది. దీంతో భువనగిరి, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాలు కాలుష్యంతో పంటలు పండించుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం మూసీని ప్రక్షాళన చేస్తున్నట్టు ప్రకటించడంతో ఇక్కడి ప్రజలకు మేలు జరుగుతుందని, మూసీ వ్యర్థజలాల స్థానంలో ట్రీట్‌మెంట్ ప్లాంట నుంచి మంచినీరు వస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో భువనగిరి, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఇప్పటికే మూసీ పునరుజ్జీవంపై స్థానిక ఎమ్మెల్యేలు బహిరంగ సభలు నిర్వహించారు. ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళనకు తీసుకుంటున్న కార్యాచరణ ప్రణాళికను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. మూసీ ప్రక్షాళనతో స్థానిక ఎన్నికల్లో

మిగతా 6వ పేజీలో...

బౌద్ధమ దేవాలయాలను

దర్శించుకున్న సబ్‌కలెక్టర్



పూజల్లో పాల్గొన్న సబ్‌కలెక్టర్ నారాయణ్

అడవిదేవులపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల శివారులోగల కృష్ణా నది తీరాన ఉన్న బౌద్ధమ దేవాలయాలను, పంచాయతన పార్వతీ పరమేశ్వర స్వామి, చెన్నకేశవస్వామి, సూర్యనారాయణ స్వామి వారిని సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఆయనకు ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకుడు యడవెల్లి రఘురామ శర్మ, అనంత కృష్ణశర్మ, తదితరులు వివరించి శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సురేష్‌బాబు, జవహర్‌లాల్, హరిబాబు, మిర్యాలగూడ ఆర్‌ఐ రామకృష్ణ, బండి నాగేశ్వర్‌రావు, పసుపులేటి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త సృజనకు ఉపక్రమించాలి



సాహితీ సదస్సులో మాట్లాడుతున్న ఆనందాచారి

తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి

నల్లగొండ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజం సమూహం నుంచి చీలి ఒంటరితనంలోకి వెళ్లడం చాలా ప్రమాదకరమని, కవులు, రచయితలు స్తబ్దత నుంచి బయటపడి సరికొత్త సృజనకు ఉపక్రమించాలని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవన్‌లో తెలంగాణ సాహితీ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంస్థ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ, మనిషి ప్రేమ భావన నుంచి వైదొలిగి కాఠిన్యం వైపు ఆలోచించడం ఆందోళనకర విషయమన్నారు. 'సమాజం-సాహిత్యం' అనే అంశంపై సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ మత దురహంకారం మళ్లీ పడగా విప్పి విజృంభిస్తోందని, ఇది సాధారణ ప్రజల జీవితాలకు ప్రమాదమన్నారు. దీన్ని ప్రశ్నించే వైఖరితో రచయితలు, కవులు స్పందించాలన్నారు. ప్రధానంగా యువ రచయితలు పూనుకోవాలన్నారు. అనంతరం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన కవితల పోటీల్లో గెలిపొందిన వారికి బహుమతులు అందజేశారు. సదస్సులో తెలంగాణ సాహితీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహ్మద్ సేన, కవులు, రచయితలు, గాయకులు మునాస్ వెంకట్, భూతం ముత్యాలు, అంబటి వెంకన, తండు కృష్ణ కౌండిన్య, మోత్కూరు శ్రీనివాస్‌లు, అనంతజు మోహనకృష్ణ, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, నరసింహ, వేముల వెంకటేశ్వర్లు, శీలం భద్రయ్య, పాల్గొన్నారు.

జాలీగా సాగర్ టూ శ్రీశైలం ట్రిప్



సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణాన్ని ముగించుకొని వస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంత అందాలను తిలకిస్తూ కృష్ణమ్మ ఒడిలో పక్షుల కిలకిల రావాల మధ్య ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సాగిన సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణం పర్యాటకులను ఆనందపరవశులను చేసింది. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేకంగా సాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీలను శనివారం ప్రారంభించింది. శనివారం మొదటి ట్రిప్పులో 85 మంది పర్యాటకులు సాగర్ నుంచి శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. శనివారం ఉదయం 10.30 గంటలకు నాగార్జునసాగర్ నుంచి బయలుదేరిన లాంచీ 110 కిలోమీటర్ల దూరం ఆరు గంటల పాటు సాగి సాయంత్రం 4.30గంటలకు శ్రీశైలం వద్ద ఉన్న లింగాలగట్టుకు చేరుకుంది. అక్కడినుంచి ప్రైవేట్ వాహనాల్లో శ్రీశైలానికి వెళ్లారు. అక్కడే రాత్రి బస చేసి ఆదివారం ఉదయం భ్రమరాంబదేవి, మల్లిఖార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం డ్యాం, పాతాళగంగ, రోప్‌వే తదితర ప్రాంతాలను తిలకించారు. హైదరాబాద్ నుంచి శనివారం పర్యాటకశాఖ బస్సు ద్వారా 50మంది శ్రీశైలం చేరుకున్నారు. పర్యాటక శాఖ బస్సులో వచ్చిన 50మందితో పాటు సాగర్ నుంచి వెళ్లినవారు అక్కడే రాత్రి బస చేసి ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. మొత్తం 85మందిలో 75మంది వివిధ మార్గాల ద్వారా శ్రీశైలం నుంచి స్వస్థలాలకు వెళ్లిపోయారు. హైదరాబాద్ నుంచి వచ్చినవారు 50, నాగార్జునసాగర్ నుంచి వెళ్లినవారిలో 10, మొత్తం 60మంది పర్యాటకులతో ఆదివారం ఉదయం 10గంటలకు శ్రీశైలం నుంచి లాంచీ బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు సాగర్‌కు చేరుకుంది. హైదరాబాద్ నుంచి వచ్చిన 50 మంది పర్యాటకులను పర్యాటకశాఖ బస్సులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

రైతులను ఆదుకోవడంలో విఫలం



తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న గోలి మధుసూదన్‌రెడ్డి

బీజేపీ నేత గోలి మధుసూదన్‌రెడ్డి

మాడ్గులపల్లి, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన పట్టాలను ఏర్పాటు చేయకపోవడంతో వర్షానికి ధాన్యం తడిసి నష్టం ఏర్పడుతోందన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రైతు భరోసా అందించలేదని, రుణమాఫీని సగం మంది రైతులకు కూడా కాలేదని, రైతులు పండించిన అన్ని రకాల ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటరెడ్డి, నాయకులు గుండా నవీన్‌రెడ్డి, సాయన్న, బండారు ప్రసాద్, సత్యనారాయణ, రమణ, బొమ్మకంటి నరసింహ, జాన్‌రెడ్డి, గురుస్వామి, వేణు, రాంరెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై దీపావళి రద్దీ



భువనగిరి బైపాస్ వద్ద వాహనాల రద్దీ

దీపావళి పండుగ, వారాంతపు సెలవులు ముగియడంతో హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జాతీయ రహదారులు రద్దీగా మారాయి. వరంగల్-హైదరాబాద్, విజయవాడ-హైదరాబాద్ రహదారులతోపాటు గుంటూరు వెళ్లే వాహనాలతో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి సైతం సందడిగా మారింది. దీంతో ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే 65వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం రద్దీ మరింత పెరిగింది.

6

భారీ వర్షానికి తడిసిన ధాన్యం



జిల్లాలో పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది.

8

ఊరికి 'గురువు'గా...

దెంది రాజేందర్‌రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. విద్యార్థులనే కాకుండా తన పరిధిలో ప్రాంతాల్లో సామాజిక రుగ్మతలను పారదోలుతూ ప్రజలను తీర్చిదిద్దుతున్నాడు. నాటుసారాతో జీవితాలను నాశనం చేసుకుంటున్న వారిలో, బాల్య వివాహాలు చేస్తున్న వారిలో మార్పు కోసం ప్రయత్నిస్తున్నాడు. విద్యార్థులకే కాదు, గ్రామం మొత్తానికే ఓ గురువుగా వ్యవహరిస్తూ అందరినీ సరైన మార్గంలో నడిపించేందుకు తపిస్తున్నాడు. ఆయన సేవను మెచ్చి అవార్డులు, పురస్కారాలు ఎన్నో వచ్చినా, తన వల్ల ప్రజల్లో మార్పు వస్తే చాలు అదే పెద్ద అవార్డు అని పేర్కొంటున్నారు రాజేందర్‌రెడ్డి. ఇదిలా ఉండగా తాను చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఓ విశేషం.

(ఆంధ్రజ్యోతి-డిండి)

విద్యార్థులతో పాటు గ్రామాన్ని తీర్చిదిద్దుతున్న టీచర్ రాజేందర్‌రెడ్డి



కార్పొరేట్ పాఠశాలను తలపించేలా తవక్లాపూర్ ప్రాథమిక పాఠశాల

నల్లగొండ జిల్లా డిండి మండలం తవక్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో 2013 నుంచి రాజేందర్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆమనగల్లు ప్రాంతానికి చెందిన రాజేందర్‌రెడ్డి తన మేనమామ ఇంట్లో ఉంటూ తవక్లాపూర్‌లోనే చదువుకున్నారు. 1998లో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఎంపికై పలుచోట్ల పనిచేశాక తాను చదువుకున్న పాఠశాలకే 2013లో ప్రధానోపాధ్యాయుడిగా వచ్చారు. ఆయనకు మొదటి నుంచి సామాజిక సేవ అంటే మమకారం. అదే ఆయన్ను ఎక్కడ ఉన్నా సేవ వైపు మళ్లించేలా చేసింది. ఓ వైపు విద్యార్థులను తీర్చిదిద్దడంతోనే తన బాధ్యత అయిపోయిందీ అనుకోకుండా గ్రామంలోని మౌలిక వసతులు, సాంఘిక దురాచారాలు, సామాజిక రుగ్మతలపై పోరాడారు.

సామాజిక రుగ్మతలపై పోరాటం

విచ్చలవిడిగా దొరుకుతున్న నాటుసారా తాగి అనారోగ్యం పాలై ప్రాణాలు పోగొట్టుకున్న వారిని చూసి ఆయన చలించిపోయారు. కుటుంబ పెద్ద చనిపోయి పిల్లలు అనాథలుగా మారడం ప్రత్యక్షంగా చూసిన ఆయన నాటుసారా నిర్మూలన కోసం ప్రయత్నించారు. గ్రామంలో నాటుసారా విక్రయాలకు నిరసనగా 100 రోజులు కాళ్లకు చెప్పులు లేకుండా తిరుగుతూ ప్రజలలో చైతన్యం తీసుకువచ్చి సఫలీకృతుడయ్యారు. నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టగలిగారు. అదేవిధంగా బాల్యవివాహల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ బాల్య వివాహలను నిలిపివేయించారు. 30కి పైగా బాల్యవివాహాలను అడ్డుకున్నారు. ఆయన కృషి గుర్తించిన కలెక్టర్ అవార్డును అందజేశారు. గ్రామంలో ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మాణంపై అవగాహన కల్పిస్తూ నిలిచిన మరుగుదొడ్ల బిల్లులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చెల్లింపులు చేయించాడు. కరోనా సమయంలో గ్రామంలోని పేద కుటుంబాలకు నిత్యావసరాలను అందజేశారు. రాజేందర్‌రెడ్డి సేవలను అప్పటి దేవరకొండ డీఎస్పీ చంద్రమోహన్ గుర్తించి 2015లో గ్రామాన్ని దత్తత తీసుకొని మూడేళ్ల పాటు పలు కార్యక్రమాలను చేపట్టారు. గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించుకునే దశలో రైతులందరినీ సమీకరించి కూరగాయలు సాగు చేసేలా ప్రోత్సహించారు. పండించిన కూరగాయలను దళారీలకు విక్రయించకుండా గ్రామంలోనే సంత ఏర్పాటుచేసి అక్కడే విక్రయించేలా చైతన్యం కలిగించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో కృషి చేస్తున్నాడు.



బాల్యవివాహాల నిర్మూలన పై సదస్సులో మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి

సేవకు దక్కిన అవార్డులు పురస్కారాలు

చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడుగా పనిచేసే అరుదైన గౌరవం రాజేందర్‌రెడ్డికి దక్కింది. సామాజిక కార్యక్రమాలలో తన క్రియాశీల పాత్ర పోషిస్తు రాజేందర్‌రెడ్డి రెండు పర్యాయాలు మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2006లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన సేవా కార్యక్రమాలను గుర్తించి స్ఫూర్తి శిఖరం సంస్థ నుంచి జాతీయ విశిష్ట పురస్కారంతో పాటు పుడమి సాహితీ వేదిక నుంచి అవార్డును అందుకున్నారు. వల్లూరి ఫౌండేషన్ ద్వారా సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆచార్యదేవ అవార్డు, మదర్‌థెరిస్సా ఎక్సలెంట్ అవార్డు, తెలంగాణ ఆణిముత్యాలు పురస్కారం పురస్కారాలు ఆయన్ను వరించారు. 2022లో ఉత్తమ దిగ్గజం అవార్డును కూడా అందుకున్నారు.

బడి ఆకట్టుకునేలా..

గ్రామస్థుల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులు కల్పనలో సఫలీకృతుడయ్యాడు. పచ్చని చెట్లతో, తరగతి గదులు రంగులతో ఆదర్శంగా తీర్చిదిద్దాడు. పూర్వ విద్యార్థుల సౌజన్యంతో పాఠశాల ప్రహరీ నిర్మాణం, తరగతి గదుల గోడలపై వర్ణ చిత్రాలు, అదనపు గదుల నిర్మాణం చేయించాడు. ఇంటింటికీ తిరిగి చదువు ప్రాధాన్యాన్ని వివరిస్తూ పిల్లలను బడిలో చేర్పించారు. ఆరేళ్లలో 80 మందికి పైగా ఇప్పటి వరకు బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాడు. రాజేందర్‌రెడ్డి కృషితో ప్రస్తుతం డ్రాప్‌అవుట్స్ లేని గ్రామంగా తవక్లాపూర్ నిలిచింది. ఇదిలా ఉండగా పేద విద్యార్థులకు ఉచిత నోటుపుస్తకాలు, దుస్తులు, టై, బెల్టులు పంపిణీ చేయించారు. డోనర్స్‌క్లబ్ ఏర్పాటు చేసి వారి సహకారంతో పాఠశాలకు కావాల్సిన మౌలిక అవసరాలను సమకూర్చుతున్నాడు. డిగ్రీ, పీజీ చదువుతున్న పేద విద్యార్థులకు తానే స్వయంగా ఫీజులు చెల్లిస్తు ప్రోత్సహిస్తున్నాడు. సొంతఖర్చులతో ఇద్దరు వలంటీర్లను నియమించి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన చేయిస్తున్నాడు. తన పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాల్లో సీట్లు సాధించేలా శిక్షణ ఇప్పిస్తున్నారు.

సమాజంలో మార్పుతేవడమే లక్ష్యం



సామాజిక రుగ్మతలతో వెనకబడుతున్న వారిలో మార్పు తీసుకురావడమే నా లక్ష్యం. ఉద్యోగంలో చేరక ముందు కూడా సేవా కార్యక్రమాలు చేపట్టా. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నా. నాకు అవార్డులు, పురస్కారాల కన్నా ప్రజల్లో మార్పే పెద్ద అవార్డు.

- దెంది రాజేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

కష్టం వస్తే మేమున్నామంటూ..

● నిరుపేదలకు దన్నుగా నిలుస్తూ..
● చదువుకు, సామాజిక అవసరాలకు బాసటగా నిలుస్తున్న యువకులు

"పుట్టిన ఊరన్నా, ఆ ప్రజలన్నా వారికి ఎనలేని ప్రేమ. ఉన్నత విద్యనభ్యసించిన ఆ యువకులు నిరుపేదలకు ఏ కష్టం వచ్చినా.. మేమున్నామంటూ ఆపన్నహస్తం అందిస్తున్నారు. సేవే మహాభాగ్యంగా ముందుకు సాగుతున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనను తమ బాధ్యతగా స్వీకరిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-త్రిపురారం)

నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామానికి చెందిన కొండా భాస్కర్ ఉన్నత విద్యనభ్యసించారు. వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. 2019 నుంచి గ్రామంలో ఎవరికి ఏకష్టమొచ్చినా ఖర్చుకు వెనుకాడకుండా సహాయం చేస్తున్నాడు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు దాహార్తి తీర్చడానికి సుమారు రూ.50వేల ఖర్చుతో బోరు, మోటారు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి ఆయన్ను అభినందించి, సత్కరించారు. అధ్వానంగా ఉన్న రహదారులను మట్టి పోసి మరమ్మతులు చేయించారు. నిరుపేదలకు కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే వారి అంత్యక్రియలకు రూ.5 వేల ఆర్థిక సాయం అందిస్తుంటాడు. అంతేకాకుండా 50 కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నాడు. ఇలా ఇప్పటివరకు పెద్దసంఖ్యలో సహాయం అందించాడు. అనారోగ్యంతో చికిత్స పొందే వారికి ప్రత్యేకంగా నగదు అందజేస్తున్నాడు భాస్కర్. మహిళలకు కోలాట ప్రదర్శనలకు చీరల పంపిణీ, ఆర్థికసాయం అందజేయడంతో పాటు క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికి క్రీడా సామాగ్రి, ప్రైజ్ మనీ అందించాడు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వెంకట్ (రౌండప్‌లో)

నాన్న జ్ఞాపకార్థంగా..

త్రిపురారం మండలంలోని దుగ్గేపల్లి గ్రామానికి చెందిన మేకల శ్యాంసుందర్ గతంలో సర్పంచ్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత కాలంలో ఆయన మృతి చెందడంతో ఆయన కుమారుడు వెంకట్ తండ్రి మీద ఉన్న ప్రేమతో ఆయన జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేపడుతున్నాడు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే ఏ కష్టం వచ్చినా నేన్నానంటూ ప్రజల అండగా ఉంటున్నాడు. నిరుపేద విద్యార్థుల చదువుకు ఆర్థికసాయం అందిస్తూనే, గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబానికి రూ.5వేల నగదు. 50 కిలోల బియ్యం అందజేస్తున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేదలకు ఆర్థికంగా అండదండగా నిలుస్తున్నాడు వెంకట్. క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం అందించాడు. శ్యాంసుందర్ సేవలను గ్రామస్థులు కొనియాడుతున్నారు.



బోరుమోటార్ అందజేసిన భాస్కర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నేడు, రేపు ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-14 టోర్నీ

భువనగిరి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-14 వాలీబాల్, అథ్లెటిక్స్ బాల, బాలికల టోర్నమెంట్‌ను సోమ, మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ వైస్‌చైర్మన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం 4వ తేదీన అథ్లెటిక్స్, 5వ తేదీ మంగళవారం వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.క్రీడాకారులు సకాలంలో రిపోర్ట్ చేయాలన్నారు. క్రీడాభిమానులు పోటీలను వీక్షించి క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

నల్లగొండకు బీసీ కమిషన్ రాక వాయిదా

నల్లగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల దామాషాపై విచారణ నిర్వహించేందుకు సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రానికి రావాల్సిన బీసీ కమిషన్ పర్యటన వాయిదా పడింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ వర్గాల ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. తెలంగాణ వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ నిరంజన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మిలు హాజరు కావాల్సి ఉండగా అనివార్య కారణాలతో కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సామాజిక వర్గాల వారు, ప్రజాప్రతినిధులు ఆసక్తి ఉన్న వారి నుంచి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు త్వరలో కమిషన్ పర్యటించ నుంది.

దారులే.. బారులై



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రహదారులన్నీ రద్దీగా మారాయి. గురువారం దీపావళి పండుగ కావడం, శుక్రవారం అమావాస్యకు తోడు ఆడపిల్లలను ఇంటి నుంచి పంపించకపోవడం, ఆ తర్వాత వారాంతం రావడంతో ఊళ్లకే పరిమితమైన ప్రజలు ఒక్కసారిగా పట్టణం బాటపట్టారు. రాజధానిలో ఉండేవారంతా ఆదివారం మధ్యాహ్నం తర్వాత వాహనాల్లో బయలుదేరడంతో దారులన్నీ వాహనాల బారులు తీరాయి.


కేతేపల్లి, చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, బీబీనగర్

యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు



చౌటుప్పల్ పట్టణంలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ

ఇటు-అటు





నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై బైపాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంతో వాహనాల రాకపోకల వేగంగా కదిలేందుకు అవకాశం లేకపోవడంతో ఇరువైపులా బారులు తీరాయి. ఈ జంక్షన్ దాటేందుకు సుమారు గంట సమయం పట్టింది.

నల్లగొండ రూరల్



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద విజయవాడ-హైదరాబాద్ మార్గం వైపు అర కిలోమీటరు ట్రాఫిక్ జామ్ అయింది. ప్రతి రోజూ 35వేల వాహనాలు వెళ్లేవి కాగా ఆదివారం అదనంగా 10వేల వాహనాలు రాకపోకలు సాగించాయి. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ప్రతిరోజూ 20వేల వాహనాలు వెళ్లే ఈ రహదారిపై 10వేల వాహనాలు అదనంగా వెళ్లాయి.

నల్లగొండ పార్లమెంట్ టీడీపీ అడ్‌హక్ కమిటీ ఖరారు

● 36 మందికి చోటు

నల్లగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా కసిరెడ్డి శేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం 36 మంది నాయకులతో కూడిన కమిటీని ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా నియామకం చేసినట్లు రాష్ట్ర కమిటీ తెలిపింది.

● నల్లగొండ నియోజకవర్గం నుంచి కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డితో పాటు సభ్యులుగా ఎల్వీ యాదవ్, మధుసూదన్‌రెడ్డి, ఆకునూరి సత్యనారాయణ, తేలన్న రవి, గుండు వెంకటేశ్వర్లును నియమించారు.

● మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి సభ్యులుగా బంటు వెంకటేశ్వర్లు, నెల్లూరి దుర్గాప్రసాద్, జాడ రాములు, మాన్యానాయక్, కాసుల సత్యం, చిలమంచల గోపి, వడ్డెబోయిన శ్రీనివాస్, నజీరోద్దీన్ బాబా, చిలకల వెంకన్న, పగిడిపాల రాంరెడ్డి, మున్న వెంకటేశ్వర్లును నియమించారు.

● కోదాడ నియోజకవర్గం నుంచి సభ్యులుగా ఓరుగంటి ప్రభాకర్, ముత్తినేని సైదీశ్వర్, బయ్య నారాయణను నియమించారు.

● హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి మండవ వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఆలీ, ఇంజమూరి వెంకటయ్య, జంగయ్య, రామజోగిని కమిటీ సభ్యులుగా నియమించారు.

● నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి అడ్‌హక్ కమిటీలో ముప్వ అరుణకుమార్, ఏ.నర్సిరెడ్డిను నియమించారు.

● దేవరకొండ నియోజకవర్గం నుంచి వస్కుల కృష్ణయ్య, ఏ. సీతారాములు, వి.రాజేష్, వెంకటేష్‌ను నియామకం చేశారు.

● సూర్యాపేట నియోజకవర్గం నుంచి సభ్యులు ధరావత్ వెంకన్న, సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సైదమ్మ, నాగేందర్ నాయుడు, వంశీలను నియమించారు.

రెండు లక్షల విత్తనాల సేకరణ

● గ్రీన్‌క్లైమెట్ ఎన్జీవోకు సరఫరా ● ఆదర్శంగా నిలుస్తున్న సందీప్‌కుమార్



మిత్రులతో కలిసి విత్తనాలు సేకరిస్తున్న సందీప్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వనజీవి రామయ్య స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నాడు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ యువకుడు అవిరెండ్ల సందీప్‌కుమార్. భూతాపం నుంచి ఉపశమనం పొందాలంటే మొక్కలు నాటి సంరక్షించాలని తలంచి మిత్రబృందంతో వేసవిలో లక్ష విత్తనాల సేకరణకు నాంది పలికిన సందీప్ జూలై మాసాంతానికి తన లక్ష్యాన్ని పూర్తి చేశాడు. పట్టణానికి చెందిన గాంధీనగర్ యూత్, అంబేద్కర్ యువజన సంఘ సభ్యులతో కలిసి వేప, గానుగ, మామిడి, సీతాఫలం, సపోట, అల్లనేరేడు, పిస్తులా, పొగడ, చింత, సుబాబు, క్యాషియో తదితర విత్తనాలను విత్తనాలను సేకరించి నియోజకవర్గవ్యాప్తంగా ఆ విత్తనాలను చల్లాడు. ఆగస్టు మాసంలో మరో లక్ష విత్తనాలను సేకరించాలన్న లక్ష్యం పెట్టుకుని ఆదివారం నాటికి పూర్తి చేశాడు. రోజు వారీ దినచర్యలో విత్తనాల సేకరణను భాగస్వామ్యం చేసుకున్న సందీప్ చల్లిన విత్తనాలు మొలకెత్తేందుకు, మొక్కలు పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్టణానికి చెందిన పర్యావరణ వేత్త, గ్రీన్ క్లైమెట్ ఎన్జీవో నిర్వాహకులు జేవీరత్నం నేవీ హెలికాప్టర్ ద్వారా అడవి, ఖాళా ప్రదేశాల్లో సీడ్ బాల్స్ విసురుతుండగా విత్తనాలు సేకరించి సదరు సంస్థకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపాడు. విత్తన సేకరణ కార్యక్రమంలో దైద శ్రీనివాస్, కత్తుల అవినాష్, కందికంటి రాజా, షేక్ రూహిత్, దైద పవన్, కంటికంటి రాజా, కొత్తపల్లి మణి తదితరులు పాల్గొన్నారు.

బాడీబిల్డర్ రాజుసంజయ్‌కు గోల్డ్ మెడల్



రాజుసంజయ్‌ను సన్మానిస్తున్న సీఐ

హుజూర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన రాజుసంజయ్ ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంలో నిర్వహించిన బాడీబిల్డర్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. తమిళనాడులోని మధురై జిల్లా మదిప్పనూరుకు చెందిన రాజుసంజయ్ తల్లిదండ్రులు రాజుకుమార్, రాజుజయ 15 ఏళ్ల కిందట హుజూర్‌నగర్‌కు వచ్చి సీతారాంనగర్‌లో స్థిరపడ్డారు. కాగా స్వీట్ షాపు నడుపుతున్న రాజుసంజయ్ బాడీబిల్డర్‌గా ఎదిగాడు. ఇటీవల విజయనగరంలో మిస్టర్ ఆంధ్రప్రదేశ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించారు. కాగా ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో రాజుసంజయ్‌ను సీఐ చరమందరాజు పూలమాలలు, శాలువాలతో అభినందించారు.కార్యక్రమంలో రవి, శ్రీను, శ్రీధర్, అజయ్, రాంబాబు, సునీల్, మంజూనాయక్, జగన్, రాంబాబు, యాకోబ్ పాల్గొన్నారు.

'స్థానిక'ంలో గెలుపెలా?

(5వ పేజీ తరువాయి)

లబ్ధిపొందాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. ఈ మేరకు గ్రామగ్రామాన మూసీ పునరుజ్జీవంపై విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహిస్తోంది.

హామీల అమలుపై సమీక్షలు

కాంగ్రెస్ సర్కారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై సమీక్షలు ప్రారంభించింది. అత్యవసరమైన పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నల్లగొండ జిల్లాలో శ్రీశైలం సొరంగమార్గం, బ్రాహ్మణవెల్లంల, సూర్యాపేట జిల్లాలో ఎత్తిపోతల పథకాలపై మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టిసారించారు. అదేవిధంగా భువనగిరి, ఆలేరు, నకిరేకల్ నియోజకవర్గాలకు సంబంధించిన బునాదిగాని కాల్వ పనుల పునరుద్ధరణకు ప్రభుత్వం పూనుకుంది. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ సాగునీటిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. వైటీడీఏను విస్తరించి, మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. స్వామివారి బంగారం తాపడం పనులు వేగవంతంచేసింది. గంధమల్ల, బునాదిగాని, ఇతర సాగునీటి కాల్వలకు నిధులు మంజూరు కోసం స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంత్రులను కోరారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఇప్పటికే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటుచేసింది. మంత్రివర్గం నిర్ణయం మేరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదలకావాల్సి ఉంది. పేదల సొంతింటి కలను నిజం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను తమ వైపునకు మలుచుకునేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

ప్రతిపక్షాల కసరత్తు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. అధికార పార్టీకి దీటుగా గ్రామాలు, పట్టణాల్లో పలు ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. బీఆర్ఎస్ ఇప్పటికే రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లతోపాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తోంది. వీటిపై ప్రజల్లో వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తూ, పూర్వవైభవాన్ని చాటాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. వారంలోగా పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికతో కార్యక్షేత్రంలోకి దిగేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో పుంజుకుంది. ఈ హవాను కొనసాగిస్తూ జిల్లా వ్యాప్తంగా పార్టీని విస్తరిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో సీట్లు గెలుచుకునేందుకు సన్నద్ధమవుతోంది. జిల్లాలోని వామపక్షాలు, ఇతర పార్టీలు సైతం బలమున్న చోట అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు సన్నద్ధమవుతున్నాయి.

ఎల్లమ్మ ఆలయంలో కార్తీకమాస పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో కార్తీకమాసం పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శివుడి విగ్రహం వద్ద ప్రమిదలు వెలిగించి దీపారాధన చేశారు. ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ఇది ప్రజలు కోరుకున్న ప్రభుత్వం

● డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

హుజూర్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇది తెలంగాణ ప్రజలు కోరుకున్న ప్రభుత్వమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల, సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో రూ.200కోట్లతో నిర్మిస్తున్న మోడల్ కాలనీ పునర్నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. అంతకుముందు గడ్డిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పేదల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతున్నామన్నారు. తెలంగాణ అభివృద్ధి దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చేయకపోగా, ప్రజల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. రాహుల్‌గాంధీ హామీ ఇచ్చిన విధంగా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై ప్రతిపక్షాల విమర్శలు అర్థం లేని వన్నారు. ప్రజల్లో లేనిపోని అనుమానాలు సృష్టించి బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. విద్య, వైద్యం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, రోడ్లు, సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏ ఊరు వెళ్లినా ఇందిరమ్మ ఇళ్లు ఉంటాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టించడంలో విఫలమైందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు నిర్మిస్తుందన్నారు. సొంత స్థలం ఉన్న ప్రజలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ అంటే పేదలకు భరోసా అని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు గూడు కల్పిస్తామన్నారు. త్వరలోనే రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. పేదలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. విద్యారంగాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు వేల కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రివర్గ సభ్యులు ప్రతిరోజూ 18 గంటల పాటు పనిచేస్తూ రాష్ట్ర సంపదను ప్రజలకు ఉపయోగపడేలా చేస్తున్నామన్నారు. రెండు వేల ఇళ్లు పూర్తి చేసి సంక్రాంతి నాటికి ఇవ్వనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గెల్లి రవి, సంపత్ రెడ్డి, గూడెపు శ్రీనివాసు, సాముల శివారెడ్డి, ఈడ్పుగంటి సుబ్బారావు, తన్నీరు మల్లికార్జున్‌రావు, యరగాని నాగన్నగౌడ్, అజీజ్‌పాషా, సైదా, జక్కుల శంభయ్య సతీష్, భాస్కర్, గురవయ్యగౌడ్ పాల్గొన్నారు.

మంత్రుల పర్యటన సాగిందిలా..

- వైటీపీఎస్ యూనిట్-1 సింక్రనైజేషన్ స్విచ్ ఆన్ చేయడంతోపాటు గూడ్స్ రైలును పరిశ్రమలోకి ప్రారంభించేందుకు వచ్చిన మంత్రులు ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.20 గంటలకు చేరుకున్నారు.
- మధ్యాహ్నం 1.25 గంటలకు దామరచర్ల శివారులోని స్టేషన్ వద్ద నుంచి గూడ్స్ రైలును జెండా ఊపి ప్రారంభించారు.
- 2.40గంటలకు పరిశ్రమలోకి వచ్చి యూనిట్-1 సింక్రనైజేషన్ స్విచ్ ఆన్ చేశారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు.
- మధ్యాహ్నం 3.10గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరిన మంత్రులు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి, హుజూర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా..

గరిడేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయిలో పోటీపడేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌లో విద్యార్థులకు వసతులు కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లిలో రూ.200 కోట్ల తో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు మంత్రులు నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. నాలుగో తరగతి నుంచి 12వ తరగతి వరకు అన్ని వర్గాల విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ అందరూ ఒకే చోట చదువుకునేలా అద్భుతంగా నిర్మించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మొత్తం మంత్రివర్గం ఆలోచించి ఇంటర్నేషనల్ స్కూల్స్ డిజైన్లు ఇచ్చే ప్రపంచ స్థాయి ఆర్కిటెక్ట్‌కు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. గత ప్రభుత్వం ఏడాదికి రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.70 కోట్లు మాత్రమే కేటాయించింది, కానీ మా ప్రభుత్వం ఇదే రంగానికి ఒకే ఏడాదిలో రూ.5 వేల కోట్లు ఖ ర్చు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు రూ.55 నుంచి రూ.175కు పెంచామని, పేద బిడ్డల ఉజ్వల భవిష్యత్ కొరకు బడుగు, బలహీన వర్గాల సంక్షేమమం కోసం ప్రభుత్వం ఎంతైనా ఖర్చు భరించేందుకు సిద్ధంగా ఉంద న్నారు. సంక్రాతి తర్వాత తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ సన్న బియ్యం ఇస్తామన్నారు. ఈసారి వరి రికార్డు స్థాయిలో 150లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అయ్యిందని, ప్రోత్సాహకంగా సన్న వరి ధాన్యం పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాంబాబు, డీఆర్డీఏ పీడీ అప్పారావు, మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, తహసీల్దార్ బండ కవిత, ఎంపీడీవో ఆర్.సరోజ, పయిడిమర్రి రంగనాథ, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుందరి నాగేశ్వరరావు, కటకం రమేష్ ఉన్నారు.

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	240	270
సూర్యాపేట	రూ.150	220	250
నల్లగొండ	రూ.150	220	250

చికెన్ ధరలు

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	588
టీఎంసీలు	305.1010
ఎడమకాల్వకు నీటి విడుదల	6,791
కుడికాల్వకు	9,633
విద్యుత్ కేంద్రం ద్వారా	29,232
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,200 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	30,834 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	47,834 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.15 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	30,739 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	33,589 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	1

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.60 అడుగులు
టీఎంసీలు	4.10
ఎన్ని గేట్ల ద్వారా	1 గేట్లు
ఇన్‌ఫ్లో	738.37 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	738.37 క్యూసెక్కులు



దామరచర్లలో పనులు పరిశీలిస్తున్న మంత్రులు భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి

4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని వినియోగంలోకి తెస్తాం

దామరచర్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 2025 మే నాటికి యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో ఐదు యూనిట్లను పూర్తి చేసి మొత్తం నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని వినియోగంలోకి తీసుకొస్తామనని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద గల యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి పరిశ్రమ యూనిట్-1 సింక్రనైజేషన్ కార్యక్రమం, పరిశ్రమకు బొగ్గు అందించే రైల్వే వ్యాగన్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రెండు యూనిట్ల పనులు పూర్తి కాగా మిగిలిన మూడు యూనిట్ల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయన్నారు. 2028-29 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 22,488 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని, 2034-35 నాటికి 31,809 మెగావాట్ల డిమాండ్‌కు పెరిగే అవకాశం ఉం దని అంచనా వేశామన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీని రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నామని, అందుకు తగిన విధంగా విద్యుత్ ఉత్పాదన చేపట్టి రాష్ట్రాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచుతామన్నారు. అందులో భాగంగా సాంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. నీటిపారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులు, అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకుపోతున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుం దూరు జైవీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఎనర్జీ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్, టెక్నికల్ డైరెక్టర్ అజయ్, ప్రాజెక్టు డైరెక్టర్ సచ్చిదానంద, చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య పాల్గొన్నారు.

మూసీలోకి దూకి ఆత్మహత్యాయత్నం

● తీవ్రంగా గాయపడిన యువకుడు



యశ్వంత్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

కేతేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులో గల వంతెనపై నుంచి మూసీ నదిలోకి దూకి యువకుడు ఆదివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎస్‌ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడలోని గన్నవరానికి చెందిన వై. క్రిష్ణ కుమారుడు యశ్వంత్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. దీపావళి పండగకు స్వగ్రామం వెళ్లిన యశ్వంత్ ఆదివారం హైదరాబాద్‌కు తన బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో మధ్యాహ్నం మూసీ నదిపై గల వంతెన మీదకు రాగానే రోడ్డు పక్కకు మోటార్ సైకిల్ నిలిపిన యశ్వంత్ వంతెనపై నుంచి నదిలోకి దూకాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు ఇది గమనించి కేతేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో 108సిబ్బందికి సమాచారం ఇచ్చి తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శివతేజ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన యశ్వంత్ వద్ద లభించిన ఆధారాలతో గన్నవరంలోని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గల్లంతైన తండ్రీకొడుకు మృతదేహాలు లభ్యం



రోదిస్తున్న కుటుంబసభ్యులు

కనగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని శాబ్దుల్లాపురం గ్రామ స మీ పంలోని ఏఎమ్మార్పీ కాల్వలో శనివారం స్నానానికి వెళ్లి గల్లంతైన గ్రామానికి చెందిన తండ్రీకొడుకు సురారం దామోదర్, ఫణీంద్రవర్మ మృతదేహాలు నల్లగొండ మండల పరిధిలోని కోదండపురం, గుండ్లపల్లి గ్రామాల వద్ద ఏమ్మార్పీ కాల్వలో ఆదివారం లభించాయి. మృతదేహాలకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందిన శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన దామోదర్ కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కాంగ్రెస్ నాయకుల ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం పంపించారు.

గల్లంతైన మృతదేహం లభ్యం

నార్కట్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బీ. వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల రిజర్వాయర్‌లో జారిపడి శనివారం గల్లంతైన గుండాల శంకర్ మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. మృతదేహాన్ని బయటికి తీసేందుకు నార్కట్‌పల్లి సీఐ నాగరాజు ఆధ్వర్యంలో రెస్క్యూ సిబ్బంది ఎంత ప్రయత్నించినా చీకటి కావడంతో సాధ్యపడలేదు. ఆదివారం ఉదయం గజ ఈతగాళ్లను రప్పించి మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. శంకర్ భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి



షెడ్డు కింద సేద తీరుతున్న భక్తులు



సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

భువనగిరి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నృసింహుడి క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రమైంది. కార్తీక మాసం రెండో రోజు, వారాంతపు సెలవురోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో క్షేత్రానికి చేరుకున్నారు. భక్తులు వచ్చిన వాహనాలతో పార్కింగ్ స్థలం నిండిపోగా క్షేత్రం చుట్టూ ఉన్న రింగ్‌రోడ్డులో కూడా వాహనాలను పార్కింగ్ చేశారు. కార్తీకమాసం పురస్కరించుకొని ఆలయంలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సత్యదేవుడి వ్రతాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధన స్థలాల్లో భక్తులతో రద్దీ నెలకొంది. కార్తీక మాసం రెండో రోజు బుకింగ్ కౌంటర్ ద్వారా 681 టికెట్లు, ఆన్‌లైన్ ద్వారా 42 టికెట్లు మొత్తం 723 మంది వ్రతం చేయించుకున్నారు. కొండపైన గర్భాలయంలో పాంచనారసింహులతోపాటు శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లలో వచ్చిన సుమారు 50వేల మంది భక్తులు ఇష్టదైవాలను దర్శించుకున్నారు.

దర్శనాలకు రెండు గంటల సమయం

వీఐపీ టికెట్(రూ.150) దర్శనానికి ఒక గంట, ధర్మ దర్శనానికి 2గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. కాగా, క్యూకాంప్లెక్స్‌లతోపాటు ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, శివాలయం, ప్రసాద విక్రయశాల, కొండకింద వ్రత మండపం, లక్ష్మీపుష్కరిణి, అన్నదాన సత్రం, కల్యాణ కట్ట తదితర ప్రాంగణాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా కొండపైకి భక్తులను తరలించేందుకు అధికారులు బస్సులను ఏర్పాటు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.60,82,772 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

వైభవంగా మణవాల తిరునక్షత్రోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో మణవాల మహా మునీశ్వరుని తిరునక్షత్రోత్సవాలు పూజారులు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఆలయ ముఖ మండపంలో వేంచేయింపు చేసి సేవను కొనసాగించారు. దివ్యప్రబంధ పారాయణాలు పఠించి తొళక్కం నిర్వహించారు. ఉత్సవాలు ఇంకో రెండు రోజుల పాటు కొనసాగనున్నట్లు అర్చకులు తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్టలో స్వామి అమ్మవార్లకు నిత్యపూజలు వైభవంగా చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రివేళ మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. కాగా, స్వామివారిని జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి(రిటైర్డు) కుటుంబసమేతంగా, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో భాస్కర్‌రావు వారికి లడ్డూ ప్రసాదం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

చౌటుప్పల్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామానికి చెందిన కొలుపులపల్లి రామ్ చరణ్(16), అతని స్నేహితులు కరంటోతు ఈశ్వర్, ఊదరి శివ బైక్‌పై తూప్రాన్‌పేటలో జరుగుతున్న సదరు ఉత్సవాలకు బయలు దేరారు. దండుమల్కాపురం శివారు ఆందోళ్ మైసమ్మ దేవాలయ సమీపంలో వెనుక నుంచి మినీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామ్‌చరణ్ మృతిచెందగా, ఈశ్వర్, శివ తేజకు గాయాలయ్యాయి. రామ్‌చరణ్ తండ్రి బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంట్లో చోరీ.. రూ.50 వేలు అపహరణ

దేవరకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం తెలుగుపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటమ్మ గ్రామంలో కిరాణ దుకాణం నడుపుతూ జీవనం కొనసాగిస్తోంది. కుమారుడు, కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారు. దీపావళి పండుగ కోసం ఆమె గత నెల 30వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని తన పిల్లల వద్దకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు వెంకటమ్మ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.50వేల నగదు ఎత్తుకెళ్లారు. ఇంటి తాళం పగిలి ఉండడంతో గమనించిన స్థానికులు ఈ నెల 2వ తేదీన వెంకటమ్మకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్ నుంచి తెలుగుపల్లికి చేరుకున్న వెంకటమ్మ ఇంట్లో చోరీ జరిగిన విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ..

● సడన్ బ్రేక్ వేయడంతో కారును ఢీకొన్న ఆటో.. ఆరుగురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన కట్టంగూరు గ్రామస్థులు

కట్టంగూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కట్టంగూరు చెందిన గ్రామస్థులు నకిరేకల్ జరిగిన వివాహానికి హాజరై స్వగ్రామానికి ట్రాలీ ఆటోలో 17మంది బయలుదేరారు. మార్గం మధ్యలోనే అయిటిపాముల గ్రామ శివారులో గల పత్తి మిల్లు దాటగానే ముందున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో డ్రైవర్ కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటో పల్టీ కొట్టింది. దీంతో పోగుల యాదమ్మ, పోగుల వెంకటయ్య, చెవుగోని అంజమ్మ, అబ్బగోని అంజమ్మ, కొండ నర్సమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. కొండ అంజయ్య, పోగుల మంగ, అంతటి పుష్పమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్ వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు, ఆటో ఢీకొన్న సమయంలోనే వెనకాల వస్తున్న మరో మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొట్టడంతో హైవేపై మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పోలీసుల వాహనాలను హైవేపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని వెళ్తుండగా..



ధ్వంసమైన మెటడోర్ వాహనం ముందు భాగం

మోతె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శుభ కార్యానికి వెళ్లి తిరిగి వస్తున్న మెటడోర్ వాహనాన్ని ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలకేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని హుస్సేనాబాద గ్రామంలో పుట్టిన రోజు శుభకార్యానికి హైదరాబాద్ నుంచి మినీ మెటడోర్ వాహనంలో 13మంది మహిళలు, పురుషులు, చిన్న పిల్లలు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత అదే వాహనంలో తిరిగి సాయంత్రం హైద్రాబాద్‌కు వెళుతుండగా హుస్సేనాబాద గ్రామం దాటి మోతె గ్రామం మీదుగా కేశవాపురం వెళ్లే రోడ్డుకు ఉన్న అండర్‌పాస్ దాటుతుండగా మోతె గ్రామంలో నుంచి వస్తున్న ట్రాక్టర్ వేగంతో వస్తున్న మెటడోర్ వాహనం ముందు భాగాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో మెటడోర్ వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ట్రాక్టర్ తొట్టి పల్టీలు కొట్టి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మెటడోర్ వాహన డ్రైవర్ జాగ్రత్త వలన పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. సంఘటనా స్థలంలో పడిపోయిన ట్రాక్టర్ ట్రాలీని పోలీసులు పక్కకు తప్పించి మెటడోర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బీసీలను అణగదొక్కితే రాజకీయ సమాధి చేస్తాం

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



బహిరంగసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

మిర్యాలగూడ టౌన్ నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బీసీలను అణగదొక్కాలని చూస్తే రాజకీయ సమాధి చేస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. నల్లగొండ మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన బీసీ గర్జన సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కుట్రలు కుతంత్రాలు పన్నుతున్నారని, బీసీ గర్జన సభను విఫలం చేసేందుకు దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు డిప్యూటీ సీఎం, మంత్రుల కార్యక్రమం పెట్టించారని ఆరోపించారు. బీసీలను ఎదుర్కోవడం బీఎల్ఆర్ వల్ల కాదన్నారు. స్థానిక నేత తమ్ముడబోయిన అర్జున్ పరిచయం చేస్తేనే బీఎల్ఆర్ తనకు తెలుసన్నారు. నియోజకవర్గ ప్రజలు బీఎల్ఆర్‌ను ఎమ్మెల్యేగా అనుకోవడం లేదని, అర్జునే ఎమ్మెల్యే అనుకుంటున్నారని అన్నారు. మిర్యాలగూడ చరిత్రలో బీసీ అభ్యర్థి ఎమ్మెల్యే కాకపోవడం దురదృష్టకరమన్నారు. ఇక రాష్ట్రంలో అగ్రకుల ఆధిపత్యం కొనసాగుతోందని, తాను ఎమ్మెల్సీగా పోటీ చేస్తే ఓడించేందుకు కుట్రలు పన్నారన్నారు. తాను ఎవరి దయాదాక్షిణ్యాలతో గెలవలేదని, బీసీ ఓట్లతోనే గెలిచానన్నారు. ఉద్యమాల ఖిల్లా అయిన నల్లగొండ జిల్లాలో బీసీ ఉద్యమానికి కార్యాచరణ రూపొందిందన్నారు.

ఈడబ్ల్యూఎస్‌తో పది శాతం బీసీల రిజర్వేషన్లకు గండికొడుతున్నారని ఆరోపించారు. భూమి, నీళ్లు, నిధులు లేని తెలంగాణ వద్దని, బీసీల తెలంగాణ రావాలని ఆకాంక్షించారు. బీసీ బిడ్డలు విద్యాలయాల్లో మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. బీసీ రాజ్యాధికారం కోసం బీసీ ఉద్యమం మిర్యాలగూడలో మొదలైందని, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో బీసీ గర్జన సభలు జరుపుతామన్నారు. బీసీ విద్యార్థులను చైతన్య పరచాలని, జరుగుతున్న అన్యాయాన్ని వివరించాలన్నారు. సభకు హాజరైన శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ మాట్లాడుతూ సమర్థుడైన తీన్మార్ మల్లన్నను సీఎంగా చూడాలని ఆకాంక్షించారు. తన నియోజకవర్గంలో వేముల వీరేశాన్ని గెలిపించిన తనకు సరైన గుర్తింపు లేదన్నారు. డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ బీసీలందరూ చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, ప్రొఫెసర్లు సూరజ్‌యాదవ్‌మండల్, లక్ష్మణ్, పుట్ట మధు, వరంగల్ శ్రీనివాస్, వట్టె జానయ్య, తమ్మడబోయిన అర్జున్, పిల్లి రామరాజు, బత్తిని లత, రజనీ, వెంకటరాజులు, కుమారస్వామి, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, సైదులు నరేందర్, ఈశ్వర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా ధాన్యం,
పత్తి కొనుగోలు చేయాలి

చండూరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కాసాల వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం, పత్తి పంటను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వర్షానికి ఇటు వరి ధాన్యం, అటు పత్తి పంట పూర్తిగా తడిసిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు కొనుగోలు కేంద్రాల్లో తేమ పేరుతో కాలయాపన చేయకుండా వేగవంతంగా కొనుగోళ్లు చేపట్టాలని అన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, రైతులు ఉన్నారు.

దళారీ వ్యవస్థను నిర్మూలించాలి

చింతపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దళారీ వ్యవస్థను శాశ్వతంగా నిర్మూలించాలని సీపీఎం మండల కార్యదర్శి ఉడుకుంట్ల రాములు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పత్తిని అమ్మడానికి సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. తూకంలో మోసం చేస్తూ రైతులను శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వంపై పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

వర్షార్పణం..



గుర్రంపోడు: చామలేడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన నీరు

● అకాల వర్షం - అపార నష్టం ● ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం ● పలుచోట్ల నేలకొరిగిన వరి

కనగల్, పెద్దఅడిశర్లపల్లి, గుర్రంపోడు, కొండమల్లేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. కొన్ని చోట్ల ధాన్యం కొట్టుకుపోయింది. కొన్నిచోట్ల వరి పంట నేలకొరగగా, పత్తి పంట తడిసింది. దీంతో రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారు. దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. పంట నష్టం తప్పదని వారు భావిస్తున్నారు. తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వర్షం ధాటికి పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

● కనగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి ఐకేపీ కేంద్రాల్లోకి వర్షపు నీరు చేరింది. రేగట్టె, కనగల్, జీఎడవల్లి, బచ్చన్నగూడెం తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులు తడిసిపోయాయి. మరోపక్క అకాల వర్షానికి కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు నేల వాలినట్లు రైతులు వాపోయారు.

● పెద్దఅడిశర్లపల్లి మండలంలో చెరువులు ఆలస్యంగా నిండటంతో వరి నాట్లు వెనకకు వేశారు. దీంతో నాటి నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఒక పక్క మండే ఎండలు మరోపక్క భారీ వర్షాలతో వ్యవసాయం సాగుతుంది. వరి పంట పొట్ట దశలో, కొన్ని కంకి దశలో, మరికొన్ని కోత దశలో ఉన్న తరుణంలో శనివారం కురిసిన వర్షం అన్నదాతల ఆశలపై నీళ్ల చల్లింది. వర్షానికి అజ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలో జాజాల రామలింగానికి చెందిన 3 ఎకరాలు, బొడ్డుపల్లి ఆంజనేయులు 2, మారుపాకుల దుర్గయ్య 5, ఆకనబోయిన వెంకన్నకు చెందిన 3 ఎకరాల వరి నేలవాలింది.

● గుర్రంపోడు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవగా వర్షం ధాటికి కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

● కొండమల్లేపల్లి మండలంలో చేతికొచ్చిన పంట తడిసిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి, పత్తి పంట తడిసింది. మండల పరిధిలో 10697 ఎకరాల్లో పత్తి, 6520 ఎకరాల్లో వరి, 55 ఎకరాల్లో కంది పంటను రైతన్నలు సేద్యం చేశారు. ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పచ్చర్లబాయి కుంట నిండింది. ఈ భారీ వర్షం వల్ల కోత దశలో ఉన్న వరి పంట నేలమట్టమైంది. భారీ వర్షం కురిసినా పెద్ద నష్టం జరగలేదని వ్యవసాయ అధికారి జానకిరాములు తెలిపారు. రైతు వేసిన పంటల్లో 33 శాతం వరకు వర్షానికి కొట్టుకుపోతేనే దానిని నష్టంగా పరిగణించాలని వ్యవసాయ అధికారి తెలిపారు.



పీఏపల్లి: అజ్మాపురం గ్రామ పంచాయతీలో నేలకొరిగిన వరి పంట



కనగల్ : ఐకేపీ కేంద్రంలో



కొండమల్లేపల్లి : వర్షానికి తడిసిన పత్తి

నేడు చెరువుల్లో
చేప పిల్లల పోత

నల్లగొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చెరువుల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని సోమవారం చేపడుతున్నారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు నల్లగొండ సమీపంలోని చర్లపల్లి గ్రామంలోని బీమసముద్రం చెరువుతో పాటు నర్సింగ్‌భట్ల గ్రామంలో చేప పిల్లలను వదలనున్నారు.

నేటి నుంచి దేవాలయ
పునః ప్రతిష్ఠాపన మహోత్సవాలు

తిరుమలగిరి(సాగర్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్వాల గ్రామంలో సోమవారం నుంచి శ్రీపార్వతీ పరమేశ్వర స్వామి పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామ పురోహితులు కాటేపల్లి తిమ్మయ్యశాస్త్రి తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం విఘ్నేశ్వరపూజతో ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. 6వ తేదీ 10.30 గంటలకు శ్రీ మాతాచారిటబుల్ ట్రస్ట్, త్రిశక్త్యాత్మక చండీ పీఠం అధిపతి కొంకపాక రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో చండీయాగం, శ్రీపార్వతీరామలింగేశ్వర సహిత గణపతి, సుబ్రహ్మణ్య, నందీశ్వర విగ్రహాల పునఃప్రతిష్టాపన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

తైక్వాండోతో ఆత్మరక్షణ

చిట్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మరక్షణ కోసం తైక్వాండో నేర్చుకోవాలని కరాటే మాస్టర్లు పట్టెడ సుధాకర్, సీమ ఫణీంద్ర కోరారు. ఆదివారం చిట్యాలలో విద్యార్థులకు తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి వివిధ రకాల బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీహరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కార్డుల అందజేత

మునుగోడు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణు ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాలు పైబడిన వారికి హెల్త్ ఇన్సూరెన్స్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కంభంపాటి నరసింహ, దేశిడి వెంకన్న, వేముల శ్రీరంగం, మేడి పెద్దులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు
బీమా హర్షణీయం

నార్కట్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాల ధరించి పూజల నిమిత్తం శబరిమలను సందర్శించే అయ్యప్ప మాలధారులకు రూ.5లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కేరళ ప్రభుత్వం ప్రకటించడంపై అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార కేంద్ర సమితి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఎస్.వాసవన్‌కు కృతజ్ఞతలు తెలిపింది. శబరిమలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార కేంద్ర సమితి అధ్యక్షుడు దేశ్‌పాండే ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు పెందోట సోము, బజ్జూరి యాదయ్య, ప్రేమ్‌గాంధీ, పూలగురు స్వామి, కృష్ణమూర్తి కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి గతంలోనే విజ్ఞప్తి చేశారు. అంతేకాక స్వాములు ఇరుముడులు విప్పుకునేందుకు 5వేల మంది కూర్చునే వీలుగా షెడ్డు నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.

'బీసీలకు రిజర్వుడ్ స్థానాలు ప్రకటించాలి'

కొండమల్లేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీలకు శాసనసభ, పార్లమెంట్ స్థానాలకు సంబంధించి రిజర్వుడు స్థానాలను ప్రకటించాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లి మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీజేఎస్ పార్టీ నాయకులకు నామినేటెడ్ పోస్టుల నియామకంలో అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమంలో సహకరించిన జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు కేటాయించి ఇంటిని నిర్మించి ఇవ్వాలని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో టీజేఎస్ కార్యకర్తలు పాల్గొంటారని అన్నారు. సమావేశంలో నాయకులు నాగేశ్వర్‌రావు యాదవ్, కర్ణకంటి కిరణ్, ఉదయ్‌కుమార్, ఆంజనేయులు, సిద్ధు పాల్గొన్నారు.

నేడు మాదిగల ధర్మయుద్ధ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

నల్లగొండ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్న ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావడానికి ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాదిగ జాతికి ద్రోహం చేస్తుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాదిగల ధర్మ యుద్ధ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కవులు, కళాకారులు, ప్రజలు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మామిడి సైదులుమాదిగ, రాష్ట్ర నాయకులు లంకపల్లి నగేష్‌మాదిగ, నాయకులు కొమిరె స్వామి మాదిగ, జిల్లా నరసింహ, బొజ్జ దేవయ్య, మాసారం వెంకన్న, బొజ్జ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం'



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వీరారెడ్డి

చిట్యాల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ఆరోపించారు. చిట్యాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట విక్రయించడానికి రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాల ని డిమాండ్ చేశారు. పదేళ్ల మోదీ పాలనలో దేశానికి ఒనగూరిన ప్రయోజనమేమీ లేదని ఆయన విమర్శించారు. మోదీ ప్రభ రోజురోజుకి తగ్గిపోతుందన్నారు. ప్రభుత్వా లు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా క మిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య. నాయకులు అరూరి శ్రీను, సరోజ, సుధాకర్‌రెడ్డి, లింగస్వామి, సుగుణమ్మ పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం తీసుకురావాలి : బంటు



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని టీడీపీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. సామాన్య ప్రజలకు రాజకీయాలను దగ్గర చేసింది టీడీపీనేనన్నారు. పార్టీ అభిమానులందరికీ సభ్యత్వాలు అందజేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాదబీమా సదుపాయాన్ని రూ. 2నుంచి రూ.5లక్షలకు పెంచడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డెబోయిన శ్రీనివాస్, నుసుం నగేష్, ఏచూరి అనంతరాములు, నసీరుద్దీన్‌బాబా, ఉప్పలపాలి గోపాలకృష్ణ, చావల వెంకటేశ్వర్లు, గర్ధాస్ ప్రభాకర్, పోట్ల శంకర్‌రావు, కస్తూరి సత్యనారాయణ, సజ్జల వెంకటరెడ్డి, అనుముల సైదులు, దాసోజు కాంతాచారి, జయరాజు, రమేష్, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు

● తెలంగాణ గురుకుల ప్రిన్సిపాళ్ల సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మల జితేందర్

నల్లగొండటౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించే వారికే మద్దతు ఉంటుందని గురుకుల ప్రిన్సిపాళ్ల సంఘం నాయకులు నిమ్మల జితేందర్, అజయ్‌కుమార్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని చైతన్య కళాశాలలో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. తమ డిమాండ్లను పరిష్కరించే వారికే మద్దతు పలుకుతామని అన్నారు. మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాళ్ల సంఘం నాయకులు విష్ణుమూర్తిగౌడ్, వేణుగోపాల్, విద్యాసాగర్, రవి, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, భిక్షపతి, రమేష్, వెంకటయ్య, స్వప్న, సునీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

● విద్యుత్‌శాఖ అధికారుల సూచన



మిర్యాలగూడలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఈ శ్రీనివాస్ సుధీర్‌కుమార్

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేయాలని డీఈ శ్రీనివాస్‌సుధీర్‌కుమార్ అన్నారు. పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని పలు మండలాల నుంచి హాజరైన వినియోగదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలు అందజేశారు. అనంతరం డీఈ మాట్లాడుతూ తమకు అందిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి సాధ్యమైనంత త్వరలో సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయి సిబ్బంది వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ విద్యుత్ సరఫరాలో ఏర్పడే అవాంతరాలను తొలగించి ప్రజల మన్ననలను పొందాలన్నారు. ఉద్యోగ సిబ్బంది అవినీతి రహిత సేవలకు ప్రాధాన్యమివ్వాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఈలు విజయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, తిరుపతయ్య, ఏఈలు అమర్‌సింగ్, ఉదయ్‌చారి, రవీందర్‌రెడ్డి, శ్రీను, నాగరాజు, మణిదీప్, హబీబ్, దాసయ్య, రేహాన్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో 14 ఫిర్యాదులు

దేవరకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండ విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యుత్ డీఈ విద్యాసాగర్, ఏడీఈ సైదులు, ఏఈలు పాల్గొని వినియోగదారుల నుంచి వచ్చిన 14 ఫిర్యాదులను స్వీకరించారు. కొండభీమనపల్లి, పెంచికల్‌పహాడ్ డబుల్ బెడ్రూం లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఇళ్ల పంపిణీ చేసి ఏడాది గడుస్తుందని విద్యుత్ మీటర్లు బిగించారు కాని కనెక్షన్ ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. 15 రోజుల్లో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని విద్యుత్ డీఈ విద్యాసాగర్ హామీ ఇచ్చారు. అనంతరం లోవోల్టేజీ పాటు నూతనంగా స్తంభాలు ఏర్పాటు చేసి వీధిలైట్లు బిగించాలని అధికారులకు విన్నవించారు. వినియోగదారులు ఇచ్చిన పిర్యాదులన్నీ పరిష్కరిస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

రామానుజాచార్యుల స్ఫూర్తితో పనిచేయాలి



రామానుజాచార్యుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు పని చేసిన రామానుజా చార్యుల స్ఫూర్తితో యువత పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన ముడుంబై రామానుజాచార్యులు సంతాపసభకు మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, జడ్పీ మాజీచైర్మన్ సీడీ రవికుమార్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, మానవ హక్కుల నేత పి.సుబ్బారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యారంగంలో విశేష ఖ్యాతి గడించిన రామానుజాచార్యులు రాష్ట్రపతి నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం గొప్ప విషయమన్నారు. విద్య, వైద్య, సామాజిక రంగాల్లో సేవలందిస్తూనే నియోజకవర్గ కేంద్రంలో రంగాచార్యులు-రంగనాయకమ్మల పేరిట శాశ్వత కంటి ఆస్పత్రిని ఏర్పాటు చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, సాధినేని శ్రీనివాసరావు, మావిళ్ల శ్రీనివాసరెడ్డి, ముక్కపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శంగా యాదయ్య రచనలు

నకిరేకల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెల్లి యాదయ్య కవితలు, రచనలు సమాజానికి ఆదర్శంగా ఉన్నాయని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రముఖ కవి డాక్టర్ బెల్లి యాదయ్య తత్వకవి ఉదారి నాగదాసు సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన అభినందన సభ సాహిత్య పరామర్శ అనే కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. సాహిత్యం, కవితలు సామాజిక స్పృహ, చైతన్యాన్ని పెంపొందించే విధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత దేవేంద్ర, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందం రెడ్డి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య ప్రజా గాయకుడు వెంకట్‌రెడ్డి, సమావేశ నిర్వాహకుడు ఇటికాల సురేందర్, వక్తలు గోపాల్ నాగరాజు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి : వర్షిత్‌రెడ్డి

చింతపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వర్షిత్‌రెడ్డి అన్నారు. చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అవినీతిని శాశ్వతంగా నిర్మూలించి అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం ఆయన చేస్తున్న కృషి అమోఘమని పేర్కొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రతీ గ్రామంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేషయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, నాయకులు బొడ్డు మహేష్, గొట్టే పర్వతాలు, కనిగిరి గోవర్ధన్, సందపట్ల రాజేష్‌సాగర్, వెంకటరమణ, అభినవ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

'రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు'



అయిటిపాముల కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న చిరుమర్తి

కట్టంగూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఎన్నికల హామీలలో భాగంగా రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని అయిటిపాములలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. పండించిన పంటలను కొనుగోలు చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. గతంలో కేసీఆర్ హయాంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన తర్వాత మిల్లర్లతో మాట్లాడి సమస్యలు పరిష్కరించామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, బోనస్ రూ.500వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు బెల్లి మహాలక్ష్మి, సుధాకర్, నలమాద వీరమ్మ సైదులు, మాజీ సర్పంచ్ వడ్డె సైదిరెడ్డి, మల్లెబోయిన శ్రీలతకృష్ణ, నరేందర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

27 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి...



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు

కనగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కనగల్ హైస్కూల్ 1996-97 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 27 ఏళ్ల సుదీర్ఘకాలం తర్వాత అప్పటి విద్యార్థులు ఒకే వేదిక మీద కలుసుకున్నారు. ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కా ర్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎండీ ఇబ్రహీం, చిత్రం శంకర్, ఎన్ శంకర్, కొండ కృష్ణ, అల్లంపల్లి శంకర్, రామకృష్ణ, చిట్ల రమేష్, కప్పి సత్తయ్య, జానీపాష, మేకల శంకర్, పున్నయ్య, గీతారాణి, షబానా, సంగీత, మమత తదితరులు పాల్గొన్నారు.

చర్యలు షురూ..

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ అధ్యాపకుడు ఈ ఫిర్యాదుల వెనక తన సహచర అధ్యాపకుడు ఉన్నారని, అతడిపై బెదిరింపులకు దిగాడు. దీంతో తనకు ప్రాణరక్షణ కల్పించాలని సదరు అధ్యాపకుడు ఇటీవల కళాశాల ప్రిన్సిపాల్‌కు కూడా పిర్యాదు చేశారు.

సీబీసీఐడీ విచారణకు డిమాండ్

లెక్చరర్ల క్రమబద్ధీకరణలో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించిన అంశంతో పాటు, వీరికి సహకరించిన అధికారులపైనా, ఇన్నాళ్లు చర్యలు తీసుకోకుండా వత్తాసు పలికిన ఇంటర్‌బోర్డులోని కీలక అధికారులపై సీబీసీఐడీ విచారణ నిర్వహించాలని, దీంతో అక్రమాలు వెలుగులోకి వస్తాయని తెలంగాణ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

క్రమబద్ధీకరణ సమయంలోనే ధ్రువపత్రాలను నిరోధించాల్సిన అధికారులు కొందరు వీరికి అండగా నిలవడం వల్లే 100మందికి పైగా కొలువులు పొందారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విచారణ చేపట్టడం హర్షనీయమని, అయితే రాజకీయ, ఉన్నతాధికారుల జోక్యంతో ఈ విచారణ పారదర్శకంగా సాగదని, సీబీసీఐడీకి అప్పగిస్తే అక్రమాలు పూర్తిగా బయటపడతాయని సమితి నాయకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు సీఐడీ విచారణకు తక్షణం ఆదేశించాలని కోరుతున్నారు.

రాబోయే రోజులు కమ్యూనిస్టులవే.. : ముదిరెడ్డి



నార్కట్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సుధాకర్‌రెడ్డి

నార్కట్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బూర్జువా పార్టీలకు దేశంలో ఇక కాలం చెల్లనుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ సీనియర్ కార్యకర్త ఆమనగంటి పెద్దవెంకన్న వర్థంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో కమ్యూనిస్టులు తిరిగి పుంజుకుని పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐకేపీ కేంద్రాల్లోకి చేరిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని, సీసీఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద ఇచ్చే సాయాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన అన్నారు. బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చెర్కు పెద్దులు, నాయకులు కల్లూరి యాదగిరి, జాల యాదమ్మ, ఆమనగంటి ఐలయ్య, దండు రవి, నరేష్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు హామీలను అమలుచేయాలి

గట్టుప్పల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని, రైతుభరోసా, గ్యాస్ సబ్సిడీ అమలు చేయాలని కోరారు. మిర్యాలగూడలో డిసెంబరు 2వ తేదీన జరిగే సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకుడు గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, నాయకులు కర్నాటి సుధాకర్, అచ్చిని శ్రీనివాస్, బొట్ట శివకుమార్, వల్లూరి శ్రీశైలం, టేకుమట్ల కృష్ణ, నరసింహ, యాదగిరి, వెంకటేశం పాల్గొన్నారు.